క్లుప్తంగా

పత్తి క్వింటాల్ రూ.6879

జడ్చర్ల: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌యార్డులో శనివారం పత్తి క్వింటాల్ గరిష్టంగా రూ.6879, కనిష్టంగా రూ.6380 ధరలు లభించాయి. మొక్కజొన్నకు గరిష్టంగా 2402, కనిష్టంగా రూ.1983, ధాన్యం ఆర్‌ఎన్‌ఆర్ రకం గరిష్టంగా రూ.2649, కనిష్టంగా రూ.1414, హంస రూ.1869 ధరలు లభించాయి.

రైతుబంధు వెంటనే ఇవ్వాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): రాష్ట్ర ప్రభుత్వం వానా కాలంలో ఇవ్వాల్సిన రైతుబంధు నిధులను రైతులకు వెంటనే ఇవ్వాలని తెలంగాణ ప్రజాఫ్రంట్ జిల్లా సమన్వయకర్త బిచ్చారెడ్డి శనివారం ఓ ప్రకనటలో డిమాండ్ చేశారు. మరోనెలలో యాసంగికి సంబంధించిన రైతుబంధు వస్తుందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఆదుకోకుండా విస్మరిస్తున్నాయని ఆరోపించారు.

కాలయాపనకే త్రిసభ్య కమిటీ

స్టేషన్ మహబూబ్‌నగర్: పెండింగ్‌లో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయులను సమస్యలను పరిష్కరించమని జేఏసీ నాయకులు కోరితే రాష్ట్ర ప్రభుత్వం మంత్రులతో త్రిసభ్య కమిటీ వేసి చేతులు దులుపుకుందని ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుఖ్‌హుస్సేన్ శనివారం ఓ ప్రకటనలో ఆరోపించారు. మంత్రుల త్రిసభ్య కమిటీ కాలయాపనకే వేసినట్లు ఉందన్నారు. ముఖ్యమంత్రి తమ ఎన్నికల మేనిఫెస్టోలో ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయడానికి రాజకీయ నిర్ణయం తీసుకోకుండా అట్టి బాధ్యతను మంత్రులకు ఇవ్వడం సమంజసం కాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

హుండీ బహూకరణ



అడ్డాకుల: మండలంలోని బలీదుపల్లి గ్రామానికి చెందిన అక్కల వెంకట్రాములుగౌడ్, పద్మ దంపతులు శివ రామాంజనేయస్వామి ఆలయానికి హుండీని శనివారం బహూకరించారు. పరిగిలో ఆర్టీసీ కండక్టర్‌గా పనిచేసే వెంకట్రాములుగౌడ్ రూ.40వేల విలువైన హుండీని తయారు చేయించి దేవాలయంలో ఏర్పాటు చేయించారు. ఆలయ నిర్వాహకులు దాతను సత్కరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

ఉచిత బీమా లబ్ధిదారుల సంఖ్య 1129



నవాబుపేట: స్థానిక మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహచారి చేసిన ఉచిత బీమా లబ్ధిదారుల సంఖ్య శనివారం 1129కి చేరింది. వారం రోజుల క్రితం మండల కేంద్రానికి చెందిన ప్రజలకు ఆయన ఉచిత బీమా చేయించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఎస్‌బీఐలో ఒక్కొక్కరికి రూ.500లు చెల్లించి రూ.5లక్షల పాలసీలు చేయించారు. దీంతో ఆయన చేపట్టిన కార్యక్రమానికి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

దళారులకు అమ్మి మోసపోవద్దు



అడ్డాకుల: రైతులు పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని ఐకేపీ ఏపీఎం వెంకటచారి అన్నారు. నందిపేట గ్రామంలో శనివారంవరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సూదిరెడ్డి లక్ష్మీకాంత్‌రెడ్డి, కురువ శ్రీకాంత్, రావుల శ్రీనివాస్‌రెడ్డి, నారాయణరెడ్డి, గాలన్న, వెంకట్‌రెడ్డి ఉన్నారు.

తెలంగాణ నాటక సమాజాల సమాఖ్య జిల్లా కమిటీ ఎన్నిక

స్టేషన్ మహబూబ్‌నగర్: తెలంగాణ నాటక సమాజాల సమాఖ్య రాష్ట్ర కమిటీకి అనుబంధంగా జిల్లా కమిటీని శనివారం ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా వి.మనోహర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వి.నారాయణ, కోశాధికారిగా ఎం ఎ.సలీం, గౌరవ సలహాదారులుగా వరకవుల నరహరిరాజు, బి.శివకుమార్, కిష్టప్పతోపాటు ఇతర కార్యవర్గ ప్రతినిధులను ఎంపిక చేశారు. ఆ సమాఖ్య రాష్ట్ర కమిటీ ప్రచార కార్యదర్శి వరకవుల దుర్వాసరాజు, సహాయకార్యదర్శి టి.కృష్ణ ఆధ్వర్యంలో ఈ ఎన్నిక నిర్వహించారు.



దేవరకద్రలో సర్వేలో పాల్గొన్న అధికారులు



గండేడ్‌లో సర్వేలో పాల్గొన్న ఏపీడీ ముసాహిదాబేగం



రాజీవ్ స్వగృహలో...

మొదటిరోజు సర్వే అంతంతే!

- తంటాలు పడ్డ ఎన్యూమరేటర్లు
- పలుచోట్ల ఇళ్లకు తాళాలు
- సరైన సమాచారం ఇవ్వని ప్రజలు
- కులాల విషయంలో గందరగోళం

దేవరకద్ర/మహమ్మదాబాద్/గండేడ్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే మొదటి రోజు శనివారం అంతంత మాత్రమే కొనసాగింది. ఎన్యుమరేటర్లు ఇంటింటికి తిరిగి సర్వేను చేయడానికి నానాతంటాలు పడ్డారు. ఇప్పటికే తమకు కేటాయించిన ఇళ్లను గుర్తించి స్టిక్కర్లు వేసి యజమానుల పేర్లతో ముందుగానే జాబితాను తయారు చేసుకున్నారు. ఆ జాబితాలో ఉన్న వరుస సంఖ్య ప్రకారం ఆయా ఇళ్లకు వెళ్లి సర్వేను ప్రారంభించారు. కొందరు ఇళ్లకు తాళం వేయడంతో మరో ఇంటికి వెళ్లాల్సి వచ్చింది. చాలామంది ఆధార్ కార్డులు చూపించలేకపోయారు. ఇళ్లలో ఉన్న మహిళలు తమ భర్త లేదని చెప్పి సరైన వివరాలు అందించలేదు. ఇక సమాచారం సరిగ్గా ఇచ్చినవారితో చేసిన సర్వే సరిగ్గా ఒక గంటకు అటు ఇటుగా సాగింది. ఇక స్థిరాస్తులు, కార్లు, ఇతర వాహనాల విషయంలో సరి అయిన సమాచారం ఇవ్వడం లేదు. అప్పుల విషయంలో కూడా వివరాలు అందించడానికి నిరాకరించారు. ఇక కులాల విషయంలో గందరగోళం నెలకొంది. కుర్వ కులస్తులు మదాసీ కుర్వలుగా, కన్వర్టెడ్ క్రిష్టియన్లు ఎస్సీలుగా నమోదు చేయించారు. ముస్లింల్లో కొందరు ఓసీలుగా ఉండగా ఉప కులాలు చెప్పి చాలామంది బీసీలుగా రాయించారు. ఎన్యుమరేటర్లు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఒక్కొక్కరు కేవలం 4నుంచి 6 ఇళ్ల సర్వేలు పూర్తిచేశారు. మొదటి రోజు కావడంతో సర్వేలు నిదానంగా సాగాయి.

దేవరకద్రలో..

దేవరకద్ర మండల కేంద్రంలో జరిగిన సర్వేలో మండల ప్రత్యేక అధికారి రవీంద్రనాథ్, ఈఓ సీత్యానాయక్ పర్యవేక్షించారు. ఎన్యుమరేటర్ల వెంట వెళ్లి సర్వేను పరిశీలించి సహకారం అందించారు. మండలంలోని డోకూర్, గోపన్‌పల్లి, గూరకొండ, కోయిల్‌సాగర్, వెంకటాయపల్లి గ్రామాల్లో సర్వే నిర్వహించారు.

గండేడ్/ మహమ్మదాబాద్‌లో...

గండేడ్ మండలంలో మొదటగా 8691 ఇళ్లు ఉన్నట్లు గుర్తించారు. స్టిక్కర్లు అతికించాక ఆసంఖ్య 10315కు పెరిగింది. ఎన్యూమరేటర్లుగా 72మందిని నియమించగా ఎనిమిది మంది వారిని పర్యవేక్షిస్తున్నారు. మహమ్మదాబాద్ మండలంలో 9148 కుటుంబాలకు 70మంది ఎన్యుమరేటర్లను నియమించారు. ఏపీడీ ముసాహిదాబేగం, ఎంపీడీఓ దేవన్న, తహసీల్దార్ తిరుపతయ్య, ఎంపీఓ నరేందర్ రెడ్డి, ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

తడబడుతూ..

జడ్చర్ల టౌన్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సర్వే జడ్చర్ల మండలంలో మొదటిరోజు తడబడుతూ కొనసాగింది. మున్సిపాలిటీ పరిధిలో 120మంది, మండలంలో 106మంది ఎన్యూమరేటర్లు సర్వే ప్రారంభించారు. బుక్‌లెట్‌లో ఒక్కో కాలంకు సంబంధించిన అంశం చూసుకుంటూ సర్వే ఫాం నింపాల్సి రావటం కష్టంగా మారిందని ఎన్యూమరేటర్లు చెబుతున్నారు. కొందరు ఎన్యూమరేటర్లు కుటుంబసభ్యులను తోడుగా తెచ్చుకుని సర్వే చేస్తున్నారు. ఒక్కో ఎన్యుమరేటర్‌కు పది నుంచి 15ఫారాలు ఇచ్చి సర్వే చేయాలని చెప్పటంతో మొదటిరోజు 80శాతం పూర్తి చేశారు. పట్టణంలో సర్వేను మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి, గ్రామాల్లో ఎంపీడీఓ విజయ్‌కుమార్ పర్యవేక్షించారు.

- జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డులో ఇద్దరు మహిళా ఉపాధ్యాయులు సర్వే నిర్వహించారు. వారిలో ఒకరు 6, మరొకరు 5 ఇళ్లల్లో మాత్రమే సర్వే నిర్వహించగలిగారు. తమకు అసిస్టెంట్ ఇస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు.
- 23వ వార్డులో ఉపాధ్యాయుడు భాస్కర్ సర్వే కోసం తన భార్యను తోడుగా తెచ్చుకున్నారు. సర్వేకు వెళ్లిన ఇంట్లో బుక్‌లెట్ ఆధారంగా వివరాలు సేకరిస్తుండగా కాలం వారీగా ఆయన భార్య నింపుతుంది.
- గంగాపురంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ ఉదయం 8గంటలకు సర్వే ప్రారంభించగా సగం ఇళ్లల్లో వ్యవసాయ పనులకు వెళ్లటంతో సాయంత్రం 4గంటల వరకు కేవలం 6ఇళ్లు మాత్రమే సర్వే చేశారు.

మిడ్జిల్: మండలంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను తహసీల్దార్ రాజు ,ఎంపీడీఓ, గీతాంజలి ప్రారంభించారు. మండలంలో మొత్తం 9420 కుటుంబాలను సర్వే చేయుటకు 72 బ్లాక్‌లుగా విభజించి 63 టీమ్‌లను 63మంది ఎన్యుమరేటర్ల 7మంది సూపర్‌వైజర్లను నియమించారు.

సర్వే కోసం 50నిమిషాలు

నవాబుపేట: సమగ్ర సర్వేకు ఒక్కొక్క ఇంటికి 50 నిమిషాల సమయం పడుతుందని సర్వే అధికారులు చెబుతున్నారు. సర్వేలో మొత్తం ప్రశ్నల సమాధానాలు రాబట్టడం కష్టంగా మారింది.

అన్ని గ్రామాల్లో..

అడ్డాకుల: మూసాపేట మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం సర్వే చేపట్టారు. అడ్డాకుల మండలంలో 324 ఇళ్లల్లో సర్వే నిర్వహించినట్లు ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. మూసాపేట మండలంలో మండల ప్రత్యేకాధికారి రాధారోహిణి సర్వేను పరిశీలించారు.



రామయ్యబౌలిలో సర్వేను తనిఖీ చేస్తున్న స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి

పట్టణంలో 1,906 ఇళ్లకు సర్వే పూర్తి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలోని మొత్తం 49వార్డుల్లో శనివారం మధ్యాహ్నం నుంచి సమగ్ర కుటుంబ సర్వే ప్రారంభమైంది.ఉదయం 526మంది ఎన్యుమరేటర్లు, 53 మంది సూపర్‌వైజర్లకు ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో మరోసారి శిక్షణ ఇచ్చారు. మొత్తం 78,696ఇళ్లకు గాను మొదటిరోజు కేవలం 1,906ఇళ్లకు మాత్రమే సర్వే పూర్తయింది. రామయ్యబౌలి (వార్డు నం.24), హనుమాన్‌పురా (వార్డు నం.12) లో జరుగుతున్న సర్వేను స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్ తనిఖీ చేశారు. మోనప్పగుట్ట (వార్డు నం.46)లో కొనసాగుతున్న కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. ఆదివారం సెలవు దినం కావడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ సర్వే కొనసాగనుంది.



నవాబుపేటలో సర్వే చేస్తున్న అధికారులు



మిడ్జిల్‌లో సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ



జడ్చర్లలో సర్వేకోసం భార్యను తోడుగా తెచ్చుకున్న ఎన్యూమరేటర్

ఓటరు జాబితాలో లోటుపాట్లు లేకుండా చూడాలి

- అదనపు కలెక్టర్ మోహన్‌రావు

జడ్చర్ల టౌన్: ఓటరు జాబితాలో లోటుపాట్లు లేకుండా చూడాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మోహన్‌రావు అధికారులను ఆదేశించారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని చిట్టెబోయిన్‌పల్లి గ్రామాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మోహన్‌రావు బీఎల్‌ఓ, సూపర్‌వైజర్లతో మాట్లాడారు. ఓటరు జాబితాలో ఎవరైనా చనిపోయిన వారున్నట్లయితే వారిని వెంటనే తొలగించాలని అన్నారు. అలాగే 18ఏళ్లు నిండిన ప్రతిఒక్కరినీ ఓటరుగా నమోదు చేయించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బ్రహ్మంగౌడ్, ఎలక్షన్ నాయబ్ తహసీల్దార్ మహబూబ్ అలీ, ఎన్నికల సీనియర్ అధికారి సలాలోద్దీన్ పాల్గొన్నారు. గ్రామంలో జరుగుతున్న సర్వేను పరిశీలించి ఎన్యుమరేటర్లకు ఆయన పలు సూచనలు ఇచ్చారు.



ప్రత్యేక ఓటరు నమోదును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మోహన్‌రావు

ఘనంగా అవోపా ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న జిల్లా అవోపా కార్యవర్గం

స్టేషన్ మహబూబ్‌నగర్: బ్రాహ్మణవాడిలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో జిల్లా ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (అవోపా) కార్యవర్గం ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా పాపిశెట్టి మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా గుమ్మడవెల్లి భాస్కర్, ఫైనాన్స్ కార్యదర్శిగా కొండూరు నర్సింహులు, కార్యవర్గం ప్రమాణస్వీకారం చేసింది. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు మల్లిపెద్ది శంకర్, ఫైనాన్స్ కార్యదర్శి కలకొండ శ్రీనివాసులు, కొండ చక్రధర్‌గుప్త, గుండ వెంకటేశ్, ఎదిరె ప్రమోద్‌కుమార్, మిర్యాల వేణుగోపాల్, కొప్పునూరి రాఘవ, సి.రాజేశ్వర్, రాఘవేందర్, సత్యవతి, కల్వ కన్నయ్య, శ్రీనివాసులు, సువర్ణ, రాజానర్సింహ తదితరులు పాల్గొన్నారు.

టీఎస్ జీహెచ్‌ఎంఏ జిల్లా అధ్యక్షుడి ఎన్నిక

నారాయణపేట: టీఎస్ జీహెచ్‌ఎంఏ జిల్లా అధ్యక్షుడిగా కృష్ణా మండలం ముడుమాల్ జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం నిజాముద్దీన్‌ను నిడ్జింత జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం ఆంజనేయులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఆర్‌వీఎం హాల్‌లో జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కో– శాధికారిగా బాలాజీ, రాష్ట్ర కౌన్సిలర్‌గా శంకర్‌నాయక్, సత్యనారాయణ సింగ్‌లను ఎన్నుకున్నారు. వారు మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. జీహెచ్‌ఎంలు కృష్ణారెడ్డి, శేఖరయ్య పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం



టంకర స్వాతి

హన్వాడ: మండలంలోని అమ్మాపూర్ గ్రామానికి చెందిన టంకర స్వాతి కనుబడుటలేదని తండ్రి కోటగిరి రాజు శనివారం హన్వాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. భర్త టంకర శివతో కలిసి ఉంటున్న స్వాతి ఈనెల 7వ తేదీ నుంచి కనబడుట లేదని పేర్కొన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటేశ్ తెలిపారు.

నేడు రక్తదాన శిబిరం

స్టేషన్ మహబూబ్‌నగర్: అయోధ్య రామమందిరం నిర్మాణంలో ఆత్మబలిదానం చేసినవారిని స్మరిస్తూ హుతాత్మతా దివాస్ సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని శ్రీరేణుక ఎల్లమ్మ దేవాలయం ప్రాంగణంలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు భజరంగ్‌దళ్ జిల్లా సంయోజక్ వంశీ, సహ సంయోజక్ కుమార్, నగర సంయోజక్ ఛత్రపతి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈశిబిరంలో పాల్గొని రక్తదానం చేయాలని వారు కోరారు.

హార్వెస్టర్లతో వరికోతలు

- వాటికి పెరిగిన డిమాండ్



రాజాపూర్: ప్రస్తుతం రైతులు హార్వెస్టర్లతో వరికోతలు కోయిస్తున్నారు. దీంతో వీటికి విపరీతమైన డిమాండ్ పెరిగింది. గతంలో పంజాబ్ తదితర రాష్ట్రాల నుంచి హార్వెస్టర్లు వచ్చి కోతలు కోసేవి. ప్రస్తుతం గ్రామాల్లో కూడా కొందరు రైతులు హార్వెస్టర్లను కొనుగోలు చేసి కోతలు కోస్తున్నారు. గంటకు రూ.2500 నుంచి రూ.3000వరకు చార్జ్ చేస్తున్నారు. వర్షం వస్తే పంట నాశనమయ్యే అవకాశాలు ఉండటంతో రైతులు తమ పంటను కోయించుకుంటున్నారు. మండల కేంద్రంతో పాటు తిర్మలాపూర్, రాయపల్లి, ముదిరెడ్డిపల్లి, మల్లేపల్లి, దొండ్లపల్లి గ్రామాల్లో రైతులు వరికోతల్లో బిజీబిజీగా ఉన్నారు.

శుభకార్యానికి వచ్చి అనంతలోకాలకు..

- కరెంట్ షాక్‌తో వ్యక్తి మృతి

రాజాపూర్(బాలానగర్): అల్లుడి ఇంటిలో జరుగుతున్న శుభకార్యానికి వచ్చి కరెంట్ షాక్‌కు గురై ఓవ్యక్తి అనంతలోకాలకు చేరిన ఘటన బాలానగర్ మండలం దేవునిగుట్టతండాలో శనివారం చోటుచేసుకుంది. బాలానగర్ ఎస్‌ఐ తిరుపాజీ తెలిపిన వివరాల మేరకు.. జడ్చర్ల మండలం నెలబండతండాకు చెందిన దస్రు(50) తన కూతురి ఇంట జరుగుతున్న పోశమ్మ పండుగల కార్యక్రమానికి వచ్చాడు. అల్లుడి పొలంలో ఉన్న ఒకచెట్టుకు కొమ్మలు అడ్డుగా ఉన్నాయి. వాటిని తొలగించేందుకు దస్రు చెట్టు ఎక్కి కొమ్మలు నరుకుతుండగా అక్కడే ఉన్న కరెంట్ వైరు తగలడంతో విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే షాద్‌నగర్‌లోని ఓఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడి భార్య జానకి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

ఘనంగా గోపాష్టమి పూజలు

దేవరకద్ర: మండల కేంద్రంలోని శివాలయంలో శనివారం ఘనంగా గోపాష్టమి పూజలు నిర్వహించారు. దేవస్థానానికి చెందిన ఆవులను ఆలయంలోకి తీసుకుపోయి వాటికి పండ్లు, ఫలహారాలు పెట్టి పూజలు చేశారు. కార్తీక మాసం సందర్భంగా దేవాలయంలో మహిళలు భక్తిశ్రద్ధలతో దీపాలను వెలిగించారు.

చిన్నరాజమూర్‌లో..

చిన్నరాజమూర్ ఆంజనేయస్వామికి శనివారం ఘనంగా పూజలు చేశారు. దేవాలయంలో జరిగిన అభిషేకం, అర్చన కార్యక్రమాలకు భక్తులు పెద్ద ఎత్తున హాజరు అయ్యారు. భక్తులు గండజ్యోతులతో ప్రదిక్షణలు చేసి, స్వామివారికి దాసంగాలు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు.

వీహెచ్‌పీ ఆధ్వర్యంలో...

దేవరకద్ర: మండల కేంద్రంలో శనివారం విశ్వహిందూ పరిషత్(వీహెచ్‌పీ) ఆధ్వర్యంలో గోపాష్టమి పూజలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఈశ్వర వీరప్పయ్యస్వామి దేవాలయం వద్ద గోవులకు పూజలు చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య, సభ్యులు చెన్నారెడ్డి, రామకృష్ణా, పూజారులు నాగరాజుస్వామి, నాగభూషణంస్వామి పాల్గొన్నారు.



దేవరకద్ర: శివాలయంలో గోవులకు పూజలు చేస్తున్న భక్తులు



వీహెచ్‌పీ ఆధ్వర్యంలో గోపాష్టమి పూజలు

దేవునిగుట్టపై కాటమయ్య ఆలయాన్ని నిర్మిస్తాం

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
- మయూరి నర్సరీలో వనభోజన మహోత్సవం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఏనుగొండలోని దేవునిగుట్టపై కాటమయ్య ఆలయాన్ని అద్భుతంగా నిర్మిస్తామని పాలమూరు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం మయూరి నర్సరీలో గౌడ సంఘం ఆధ్వర్యంలో కార్తీకమాస వనభోజన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో గౌడ సంఘం కమ్యూనిటీ భవన నిర్మాణానికి సహకరిస్తామని హామీ ఇచ్చారు. అంతకుముందు చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. అనంతరం అందరూ కార్తీకమాస వన భోజనాలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్, వైస్ చైర్మన్ షబ్బీర్‌అహ్మద్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు సత్తూర్ చంద్రకుమార్‌గౌడ్, లక్ష్మణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి సేవా సమితి మహిళా విభాగం ఆధ్వర్యంలో..

స్టేషన్ మహబూబ్‌నగర్: పాలమూరు రెడ్డిసేవా సమితి మహిళా విభాగం ఆధ్వర్యంలో శనివారం బీకేరెడ్డికాలనీలోగల బీబీఆర్ ఫంక్షన్‌హాల్‌లో కార్తీక వనభోజన మహోత్సవం నిర్వహించారు. మహిళలందరూ సామూహికంగా ఉసిరిచెట్టుకు పూజలు చేసి శ్రీవెంకటేశ్వర గోవిందనామాలు జపించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత, సేవా సమితి మహిళా విభాగం అధ్యక్ష, కార్యదర్శులు సరస్వతి, స్వరూప, కోశాధికారి శోభ, వనజ, వరలక్ష్మి, నర్మద, శశికళ, మీనాక్షి, హేమలత, నిర్మల, శ్రీలత, అనిత, రమాదేవి, విజయలక్ష్మి, రాజేశ్వరి, డాక్టర్ చేతన, వినోద, సమితి ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి వేపూరు రాజేందర్ రెడ్డి, ధనుంజయరెడ్డి, జి.వెంకట్రామారెడ్డి, నలమద్ది సురేందర్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వన మహోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుందాం

స్టేషన్ మహబూబ్‌నగర్: మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుందామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని చిన్నదర్పల్లిలో శనివారం రాత్రి సదర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే యెన్నం పాల్గొని శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీపావళి పండుగ తర్వాత పంటలు ఇంటికి వచ్చే సందర్భంలో జరుపుకునే సదర్ ఉత్సవం అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే వీటిని ఘనంగా జరుపుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, శాంతన్న యాదవ్, కౌన్సిలర్ లతశ్రీలక్ష్మణ్, టంకర కృష్ణయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలి

కోయిల్‌కొండ: రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ వ్యవసాయాన్ని చేయాలని జిల్లా రిటైర్డ్ విద్యాధికారి విజయ్‌కుమార్ అన్నారు. 'బాపు బాటలో సత్యశోధన' 100రోజుల్లో 1000కిలోమీటర్ల పాదయాత్రలో భాగంగా శనివారం గార్లహాడ్ గ్రామంలో ఆయన పర్యటించారు. ఈసందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ గ్రామాలు పటిష్టం కావాలంటే గాంధీ మార్గంలో నడవాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు ఆంజనేయులు, శ్రీహరిగౌడ్, నాయకులు వెంకట్రామిరెడ్డి, మల్లయ్యగౌడ్, వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా రిటైర్డ్ విద్యాధికారి విజయ్‌కుమార్

బియ్యం వాహనం పట్టివేత

అడ్డాకుల: మూసాపేట మండలం వేముల శివారులో శనివారం బియ్యం వాహనాన్ని పోలీసులు పట్టుకున్నారు. గ్రామానికి సమీపంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా ఉన్న గుట్ట వద్ద బియ్యం లోడుతో ఉన్న బొలెరో వాహనాన్ని గ్రామస్తులు గుర్తించారు. ఎస్‌ఐ శ్రీనివాసులుకు సమాచారం అందజేశారు. ఆయన వెంటనే ఇద్దరు కానిస్టేబుళ్లను అక్కడికి పంపించి విచారణ చేయించారు. వాహనంలో బియ్యం ఉండటంతో దాన్ని పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పరిశీలించి ఇచ్చే నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.



బియ్యం లోడ్‌తో ఉన్న వాహనం వద్ద పోలీసులు